


## అపోలో లాభం రూ. 372 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 10:అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.372 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది సంస్థ. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.245 కోట్ల లాభంతో పోలిస్తే 52 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.4,851 కోట్ల నుంచి రూ.5,527 కోట్లకు ఎగబాకింది. వచ్చే మూడు నుంచి నాలుగేండ్లకాలంలో కొత్తగా 11 ప్రాంతాల్లో ఆసుపత్రులను ఏర్పాటు చేయడం ద్వారా కొత్తగా 3,512 పడకలు జతకానున్నాయని అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు. ముంబై నుంచి వారణాసి, చెన్నై నుంచి గురుగ్రామ్ వరకు ఉత్తమ వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.9 లేదా 180 శాతం మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

PATANJALI FOODS LIMITED


## పతంజలి ఫుడ్ ఆకర్షణీయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.370.93 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది పతంజలి ఫుడ్స్ లిమిటెడ్. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.216.54 కోట్ల లాభంతో పోలిస్తే 71.29 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం కూడా రూ.7,910.70 కోట్ల నుంచి రూ.9,103.13 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. నిర్వహణ ఖర్చులు కూడా రూ.8,652.53 కోట్లకు ఎగబాకాయి

# గోల్డ్ హై జంప్

**ఒక్కరోజే రూ.2,430 ఎగిసిన తులం ధర**

## ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.88,500కు చేరిక



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: బంగారం ధరలు భారీగా పెరిగాయి. ఆల్‌టైమ్ హైలో స్థిరపడ్డాయి. సోమవారం ఒక్కరోజే దేశీయ మార్కెట్‌లో దాదాపు రెండున్నర వేలు పుంజుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. స్టాక్, ఫారెక్స్ మార్కెట్లతోపాటు బులియన్ మార్కెట్‌నూ షేక్ చేసేశాయి మరి. ఈ క్రమంలోనే ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల ధర రూ.2,430 ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా రూ.88,500ను తాకింది. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలియజేసింది.

**ఇదీ సంగతి..**

అగ్రరాజ్యంలోకి దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియంలపై 25 శాతం సుంకాలు వేస్తామని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు కుదేలవగా.. బంగారం, వెండి తదితర కమోడిటీ మార్కెట్లు పరుగులు పెట్టాయి. ఈ నేపథ్యంలోనే స్పాట్ మార్కెట్లలో ఔన్స్ గోల్డ్ విలువ రికార్డు స్థాయిలో 2,900 డాలర్లు పలికింది. కోమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లోనూ రూ.2,932.69 డాలర్లుగా ట్రేడైంది. త్వరలోనే 3,000 డాలర్లు పలికినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇక సిల్వర్ ఔన్స్ 32.76 డాలర్లను చేరింది. ఈ ట్రెండ్ దెబ్బకు భారతీయ మార్కెట్లలోనూ హోల్‌సేల్, రిటైల్ నగల వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ కనిపించింది. ఫలితంగా ఒక్కసారిగా రేట్లు పైపైకి పోయాయి. నిజానికి గతకొద్ది రోజులుగా గోల్డ్ మార్కెట్ దూకుడు మీదనే ఉన్నది. స్టాక్ మార్కెట్ల ఒడుదొడుకుల నడుమ ఇన్వెస్టర్లు.. సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపే అడుగులు వేస్తున్నారు. అయితే ట్రంప్ దుందుడుకు నిర్ణయాలతో వాణిజ్య యుద్ధానికి అవకాశాలుండటంతో పుత్తడి ధరలు రాబోయే రోజుల్లో మరింత పెరిగే వీలే ఉన్నదంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. దీంతో మదుపరులు గోల్డ్‌పై ఇంకా ఇన్వెస్ట్‌మెంట్లు పెట్టవచ్చని అంచనా వేస్తున్నా రు. అదే జరిగితే సరికొత్త శిఖరాలను ధర లు అధిరోహించడం ఖా యమేనన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి ప్పుడు.

**హైదరాబాద్‌లో..**

దేశ రాజధానిలో ధరలతో పోల్చితే హైదరాబాద్ మార్కెట్‌లో రేట్లు ఒకింత స్థిరంగానే ఉన్నట్టు కనిపిస్తున్నాయి. తులం 24 క్యారెట్ గోల్డ్ రేటు రూ.87,060గా ఉన్నది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) పసిడి ధర రూ.79,800గా నమోదైంది. గతంతో పోల్చితే వరుసగా రూ.390, రూ.350 చొప్పున పెరిగాయి. ఇక ఢిల్లీలో కిలో వెండి ధర రూ.97,500గా ఉన్నది. మునుపటితో చూస్తే రూ.1,000 పెరిగింది. ఇక ఎంసీఎక్స్‌పై ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఏప్రిల్‌కుగాను 10 గ్రాములు రూ.940 పెరిగి రూ. 85,828గా నమోదైంది. జూన్‌కు రూ.1,015 ఎగిసి రూ.86,636గా ఉన్నది.

**త్వరలో తులం లక్ష?**

బంగారం ధరలు పెరుగుతున్న తీరును చూస్తే తులం లక్ష రూపాయలను తాకే సమయం ఎంతో దూరంలో లేదనిపిస్తున్నది. రేపటి రోజుల్లో పసిడి ధరలు మరింత పెరుగుతాయంటున్న మార్కెట్ నిపుణులు.. ఈ ఏడాది చివర్లో దేశీయ విపణిలోనే 10 గ్రాములు లక్ష రూపాయల మార్కును తాకినా ఆశ్చర్యపోనవసరం లేదని చెప్తున్నారు మరి. అయితే గ్లోబల్ మార్కెట్‌లోనూ ఔన్స్ 2,900 డాలర్ల మార్కును దాటడం ఈ అంచనాలకు బలం చేకూరుస్తున్నది. మొత్తానికి ఈ ఏడాది ధరల స్థిరీకరణకు అవకాశాలు తక్కువేనన్న మాట మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ నుంచి వినిపిస్తున్నది.

## రిలయన్స్ స్పోర్ట్స్ డ్రింక్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:రిలయన్స్ గ్రూపునకు చెందిన రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ తాజాగా స్పోర్ట్స్ హైడ్రేషన్ డ్రింక్ సెగ్మెంట్‌లోకి ప్రవేశించింది. ప్రముఖ శ్రీలంక క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్‌తో కలిసి స్పిన్నర్ పేరుతో ఈ డ్రింక్‌లను మార్కెట్లోకి విడుదల ఏసింది. ఇప్పటికే కంపా కొలా పేరుతో కూల్‌డ్రింక్స్‌ను విక్రయిస్తున్న సంస్థ తాజాగా విడుదల చేసిన 150 ఎంఎల్ సింగిల్-సర్వ్ బాటిల్ కలిగిన స్పోర్ట్స్ డ్రింక్ ధర రూ.10గా నిర్ణయించింది. ఇతర పోటీ సంస్థలైన పెప్సీకో, కోక-కోలాకు చెందిన స్పోర్ట్స్ డ్రింక్స్ కంటే తక్కువ ధరతో విడుదల చేయడం విశేషం.

## టాటా బోయింగ్ 300వ ఫ్యూజ్‌లేజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 10: టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ హైదరాబాద్ యూనిట్ నుంచి ఏహెచ్-64 అపాచీ అటాక్ హెలికాప్టర్ కోసం మరో బాడీని డెలివరీ చేసింది. ఈ ఫ్యూజ్‌లెజ్ 300వది కావడం విశేషం. ఇక ఈ హెలికాప్టర్లను అమెరికా ఆర్మీతోపాటు భారత ఆర్మీ కూడా వినియోగిస్తున్నది. దేశీయ ఎయిర్‌ఫోర్స్ 22 ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్లను కలిగివున్నది. బోయింగ్, టీఏఎస్ఎల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో 900 మంది ఇంజినీర్లు, టెక్నిషన్లు ఉన్నారు. 14 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో తయారైన ఉత్పత్తులు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతున్నాయి.




# ట్రంప్ టారీఫ్‌ల దెబ్బ

## సెన్సెక్స్ 548, నిఫ్టీ 178 పాయింట్ల పతనం

ముంబై, ఫిబ్రవరి 10: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగోరోజూ భారీగా నష్టపోయాయి. అమెరికా దిగుమతి చేసుకునే అల్యూమినియం, స్టీల్‌పై 25 శాతం సుంకం విధిస్తామని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు మార్కెట్లపై పిడుగుపడ్డట్టు అయింది. మదుపరుల్లో నమ్మకం సడలడంతో అమ్మకాల బటన్ నొక్కారు. బ్లూచిప్ సంస్థల షేర్లతోపాటు బ్యాంకింగ్, మెటల్, చమురు రంగ షేర్లు కుదేలవడం సూచీల పతనానికి ఆజ్యంపోసింది. ఇంట్రాడేలో 750 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 548 పాయింట్లు నష్టపోయి 77,311.80 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 178.35 పాయింట్లు కోల్పోయి 23,381.60 వద్ద స్థిరపడింది. అమెరికా టారిఫ్ భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని, దేశీయ మదుపరులు తమ పెట్టుబడులను ఈక్విటీల నుంచి సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం కూడా పతనానికి పరోక్షంగా కారణమయ్యాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

**టాప్ లూజర్‌గా పవర్‌గ్రిడ్**

నిరుత్సాహక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో పవర్‌గ్రిడ్ షేరు భారీగా పతనం చెందింది. ఒక దశలో నాలుగు శాతానికి పైగా నష్టపోయిన షేరు చివరకు 3.45 శాతం నష్టంతో రూ.268.70 వద్ద ముగిసింది. దీంతోపాటు టాటా స్టీల్, జొమాటో, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ షేర్లు కూడా రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి. అలాగే మహీంద్రా, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, రిలయన్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి. వీటితోపాటు సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, నెస్లె, ఎస్బీఐ షేర్లు పతనం చెందాయి. కానీ, కొటక్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, హెచ్‌యూఎల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ 2.25 శాతం తగ్గగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.06 శాతం క్షీణించాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ రంగ సూచీ అత్యధికంగా 2.69 శాతం నష్టపోగా, మెటల్ 2.63 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 2.61 శాతం, యుటిలిటీ 2.49 శాతం దిగువకు పడిపోయాయి.

**నష్టాలకు కారణాలు ఇవే**

- అమెరికా దిగుమతి చేసుకునే స్టీల్, అల్యూమినియంపై 25 శాతం సుంకాల ప్రకటన
- దేశీయ మార్కెట్లో విదేశీ మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడం
- రూపాయితో పోలిస్తే డాలర్ మరింత బలపడటం
- దేశీయ కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు

**నాలుగు రోజుల్లో 7.68 లక్షల కోట్లు ఆవిరి**

స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతుండటంతో లక్షల కోట్ల రూపాయల మదుపరుల సంపద కరిగిపోతున్నది. ఎఫ్ఐఐలు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, కొత్తగా టారిఫ్ యుద్ధానికి ట్రంప్ తెరలేపడంతో గత నాలుగు సెషన్లలో మదుపరులు రూ.7.68 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్‌ఈలో నమోదిత సంస్థల విలువ రూ.7,68,252.32 కోట్లు కరిగిపోయి రూ.4,17,82,573.79 కోట్లకు చేరింది.

# 88 దగ్గరదాకా..

**ఆఖర్లో కోలుకున్న రూపాయి • 5 పైసలు పెరిగి 87.45 వద్ద ముగింపు**



ముంబై, ఫిబ్రవరి 10: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ సోమవారం తీవ్ర ఆటుపోట్లకు లోనైంది. ఒకానొక దశలో 50 పైసలు క్షీణించి 88 దరిదాపుల్లోకి దిగజారింది. ఆల్‌టైమ్ ఇంట్రా-డే కనిష్ఠాన్ని తాకుతూ 87.95 స్థాయిని చేరింది. అయితే ఆఖర్లో కోలుకున్నది. ఈ క్రమంలోనే చివరకు 5 పైసలు లాభపడి 87.45 వద్ద ముగిసింది. శుక్రవారం 87.50 దగ్గర ఆగిన విషయం తెలిసిందే. కానీ అంతకుముందు రోజు గురువారం మునుపెన్నడూ లేనివిధంగా 87.59 స్థాయికి పడిపోయి ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో తాజా లాభాలతో వరుసగా రెండు రోజుల ట్రేడింగ్‌ల్లో 14 పైసలు లాభపడినట్లైంది. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ దేశంలోకి దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియంలపై 25 శాతం సుంకాలు వేయడం డాలర్‌ను బలపర్చింది. అమెరికాపై పరస్పర సుంకాలతో బదులిస్తున్న దేశాలపై ప్రతీకార సుంకాలకూ ట్రంప్ దిగుతున్నారు. ఇది అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారితీస్తుందేమోనన్న భయాలు ఇప్పుడు వెంటాడుతున్నాయి. ఈ అంచనాలు కూడా రూపీని బలహీనపరుస్తున్నాయన్న అభిప్రాయాలు ఫారెక్స్ మార్కెట్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

## రిక్తమ్ ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ సేవలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10: హైదరాబాద్ ఆధారిత రిక్తమ్ గ్రూపు తాజాగా కృత్రిమ మేధస్సు(ఏఐ) ఆధారంగా ఇంటర్వ్యూ సేవలు అందించే టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. మానవ వనరుల విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంలో సరికొత్త టెక్నాలజీని పరిచయం చేసినట్లు ఇంటర్వ్యూ ఏఐ కో-ఫౌండర్, సీఈవో సిద్ధరామ్ శింగిషెట్టి తెలిపారు. ఈ సేవలతో ఇంటర్వ్యూ మరింత సులభతరం కానున్నదని, అలాగే సమయం ఆదా కానున్నదని ఆయన చెప్పారు.

## రోగాల కోళ్లు.. మన రాష్ట్రంలోకి..

- అక్రమంగా హైదరాబాద్‌కు తరలింపు
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు



పోచారం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్సై మల్లారెడ్డి

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 10: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో రోగాల బారిన పడిన కోళ్లను అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దు పోచారం వద్ద రహదారిపై సోమవారం చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. తెలంగాణకు పక్కనే ఉన్న రాష్ట్రాల్లో కోళ్లకు రోగాలు వచ్చి చనిపోతున్నట్లు గుర్తించిన వ్యాపారులు, వాటిని అక్రమంగా హైదరాబాద్ తరలిస్తున్నట్లు సమాచారం వచ్చినట్లు వెల్లడించారు. దీంతో జిల్లా సరిహద్దులో ఉన్న పోచారం గ్రామం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి నిఘా పెంచినట్లు తెలిపారు.

## జాతీయస్థాయి రగ్బీ పోటీలకు 'ఆశ్రమ' విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సిరికొండ, ఫిబ్రవరి 10 : జాతీయస్థాయి రగ్బీ పోటీలకు మండలకేంద్రంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థి చిన్న ఎంపికైనట్లు పీడీ ప్రశాంత్ సోమవారం తెలిపారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు మంచిర్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబర్చి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్.. ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించారు.

# ఇందిరమ్మ కాలనీలో తీవ్ర నీటిఎద్దడి

- ఏడాది నుంచి వృథాగా మినీ వాటర్‌ట్యాంకు
- సొంత బోర్లున్న వారి నుంచి నీటిని కొంటున్న పేద కూలీలు
- ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన
- మినీ వాటర్‌ట్యాంకుకు కనెక్షన్ పునరుద్ధరిస్తే తీరనున్న నీటి గోస

సారంగాపూర్, ఫిబ్రవరి 10 : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ సారంగాపూర్ గ్రామంలో ఉన్న ఇందిరమ్మ కాలనీలో నీటి ఎద్దడి నెలకొన్నది. కాలనీలో నివాసముంటున్న 25 కుటుంబవాసులు ఏడాది నుంచి తాగునీటి వసతి కరువై అల్లాడిపోతున్నారు. కాలనీవాసుల దాహార్తిని తీర్చడానికి నిర్మించిన మినీ వాటర్ ట్యాంకు కొన్నేండ్ల పాటు తాగునీటి సరఫరా చేసింది. వాటర్ సరఫరా సిబ్బంది తప్పిదంతో ఏడాదిగా వృథాగా మారి అలంకారప్రాయంగా మిగిలింది. కూలీ పనుల మీద ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న తాము తాగడానికి, ఇతర అవసరాల కోసం వినియోగించుకునేందుకు నీటి వసతి లేక సొంత బోర్లున్న వారి నుంచి నీటిని కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొన్నదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో నీటి కోసం ఏడాది నుంచి పడరాని పాట్లు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. స్థానిక ఎంఐఎం కార్పొరేటర్ అందుబాటులో ఉండడం లేదని, తాము ఎదుర్కొంటున్న నీటి సమస్యను మున్సిపల్ అధికారులు, నాయకులు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సమస్య ఏర్పడిందిలా..**

ఇందిరమ్మ కాలనీవాసులకు తాగునీరందించడానికి వాటర్ ట్యాంకులను కొన్నేండ్ల క్రితం నిర్మించారు. ఏడాది క్రితం ఇంటి కుళాయి కనెక్షన్ కోసం నలుగురు దరఖాస్తులు చేసుకున్నారు. వారికి మున్సిపల్ వాటర్ సప్లయి అధికారులు పెద్ద పైపులైన్ నుంచి నీటి కనెక్షన్ ఇవ్వాల్సి ఉండగా ఒక ఇంచ్ పైపు లైన్ నుంచి నీటి సరఫరాకు కనెక్షన్ ఇచ్చారు. దీంతో ఇండ్ల వద్ద ఏర్పాటు చేసుకున్న కుళాయిలకు నీరు రాలేదు. మినీ వాటర్ ట్యాంకు వద్ద కుళాయిల నుంచి నీరు పట్టుకునేందుకు వచ్చిన మహిళలు, ఇంటి కనెక్షన్ పొందిన మహిళలకు మధ్య గొడవలు, కొట్లాటలు పెరిగిపోయాయి. నిత్యం కొట్లాటల ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. దీంతో వాటర్ సప్లయి అధికారులు అనాలోచిత నిర్ణయంతో మినీ వాటర్ ట్యాంకుకు సరఫరా చేసే పైపులైన్ కనెక్షన్ కట్ చేశారు. అదేవిధంగా ఆ నాలుగు ఇండ్లకు కూడా కనెక్షన్లు తొలగించారు. దీంతో ఏడాది నుంచి ఈ ట్యాంకుకు నీరు సరఫరా కాక వృథాగా పడి ఉంటున్నదని కాలనీవాసులు తెలిపారు. కాలనీలోని ఓ దుకాణాదారుడి సొంత బోరు నుంచి కొన్ని కుటుంబాల వారు నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలా బోర్లున్న వారికి డబ్బులు చెల్లించి నీటిని కొంటున్నామని, మినీ వాటర్ ట్యాంకుకు ఇంతకుముందున్న విధంగా కనెక్షన్ ఇస్తే నీటి గోస తీరుతుందని మహిళలు కోరుతున్నారు.



ఇందిరమ్మ కాలనీలో ఏడాదిగా వృథాగా మారిన మినీ వాటర్ ట్యాంకు

**నల్ల కనెక్షన్ కోసం రూ. 4 వేలు ఖర్చు పెట్టిన..**



ఇంటికి నల్లా కనెక్షన్ ఇస్తామని అధికారులు చెబితే డబ్బులు కట్టినాను. ఇంటి వరకు నీటి సరఫరా చేసే పైపులు, నల్ల ఏర్పాటు కోసం సామాన్లు తెచ్చుకుని ఏడు నెలల నుంచి ఇంట్లోనే వట్టిగా ఉన్నాయి. మొత్తం 4 వేల రూపాయలు ఖర్చయ్యాయి. కానీ నల్లా కనెక్షన్ ఇప్పటివరకు ఇవ్వలేదు. నీళ్ల కోసం మేము చాలా బాధలు పడుతున్నాం. ఎవరూ కూడా పట్టించుకోవడం లేదు.

**- మరియమ్మ, ఇందిరమ్మ కాలనీవాసి**

**కమిషనర్ సార్ నీటి సమస్య తీర్చాలి**



ఒక ఏడాది నుంచి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. సొంత బోర్లున్న వారి నుంచి నీళ్లు కొనుక్కోవాల్సి వస్తున్నది. కూలీ పనులతో బతుకుతున్న మాకు నీళ్లు కొనుక్కోవడం కష్టమవుతున్నది. ఎలాగైనా చిన్న ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చి, నీరు వచ్చేటట్లు కమిషనర్ సార్ చూడాలి

**-ఎల్లవ్వ, ఇందిరమ్మ కాలనీ మహిళ**

**ప్రజాసమస్యలు పట్టని అధికారులు**



కాంగ్రెస్ పాలనలో అధికారులు ప్రజా సమస్యలు పట్టించుకోకుండా పూర్తిగా అశ్రద్ధ వహిస్తున్నారు. ఏడాది నుంచి ఇందిరమ్మ కాలనీలో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయి. పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇక అధికారులు స్పందించకపోతే ఆందోళన చేపడతాం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మినీ వాటర్‌ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చి, నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

**-ఎండీ అక్బర్ నవాజుద్దీన్**

## అనుమతులు లేకుండా డిప్యుటేషన్‌పై వెళ్లడమేంటి?

**వైద్యసిబ్బందిపై అదనపు కలెక్టర్ అంకిత్ ఆగ్రహం**
**వర్ని ప్రభుత్వ దవాఖాన తనిఖీ**



దవాఖానలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

వర్ని (రుద్రూర్), ఫిబ్రవరి 10 : దవాఖానలో పనిచేసే వైద్యులు, సిబ్బంది అధికారుల అనుమతులు లేకుండా డిప్యుటేషన్‌పై ఇతర దవాఖానలకు వెళ్లడమేంటని అదనపు కలెక్టర్ అంకిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్ని ప్రభుత్వ దవాఖానను ఆయన సోమవారం తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది, మందుల రిజిస్టర్‌తోపాటు అవుట్ పేషెంట్ రిజిస్టర్ సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తంచేశారు. దవాఖానలో మందులను పరిశీలించారు. కుక్కకాటు, కోతి, పాముకాటుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయా? దవాఖానలో ఎంతమంది వైద్యం చేయించుకుంటున్నారన్న విషయాలపై ఆరా తీశారు.

## కుంభమేళాలో బీఆర్‌ఎస్ జెండాతో ర్యాలీ

**కేసీఆర్ తిరిగి సీఎం కావాలని యంచ నేతల పూజలు**



కుంభమేళాలో బీఆర్‌ఎస్ జెండాతో యంచ బీఆర్‌ఎస్ కార్యకర్తలు

నవీపేట, ఫిబ్రవరి 10: ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో బీఆర్‌ఎస్ జెండా రెపరెపలాడింది. తెలంగాణలో కేసీఆర్ సీఎం కావాలంటూ యంచ గ్రామ బీఆర్‌ఎస్ నేతలు ప్రత్యేక పూజలు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. యంచకు చెందిన బీఆర్‌ఎస్ నేత వంజరి రాజేశ్వర్ ఆధ్వర్యంలో 30 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు మహా కుంభమేళాకు తరలి వెళ్లారు. భారీ బీఆర్‌ఎస్ జెండాను చేతబూని కుంభ మేళా ర్యాలీలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను బీఆర్‌ఎస్ ఎంతగానో ఆకట్టుకుంది.

## నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



శిక్షణకు హాజరైన అధికారులు

బోధన్, ఫిబ్రవరి 10: రాబోయే స్థానిక సంస్థల, పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. సోమవారం బోధన్ పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల శిక్షణ శిబిరానికి ఆయన హాజరై పలు సూచనలు చేశారు. పంచాయతీ ఎన్నికలకు ముందస్తుగా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ అనంతరం చేసిన సూచనల మేరకు నామినేషన్ల స్వీకరణ, ఇందుకు అవసరమయ్యే భవనాలు ఎంపిక చేసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణతో పాటు బ్యాలెట్ పేపర్లు తదితర అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయాల్లో వీడియోలు చిత్రీకరించాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో అధికారులు క్రియాశీలకంగా విధులు నిర్వహిస్తూ, ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

కంఠేశ్వర్, ఫిబ్రవరి 10 : ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు సంబంధించిన తుది జాబితాను అధికారులు విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాలోని పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల వివరాలు, పోలింగ్ స్టేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.

**ఉపాధ్యాయ ఓటర్ల వివరాలు**

| డివిజన్ | మండలాలు | పోలింగ్ స్టేషను | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|---|---|
| నిజామాబాద్ | 10 | 10 | 1,054 | 947 | 2,001 |
| బోధన్ | 10 | 10 | 391 | 310 | 701 |
| ఆర్మూర్ | 13 | 13 | 731 | 318 | 1,049 |

**పట్టభద్రుల వివరాలు**

| డివిజన్ | మండలాలు | పోలింగ్ స్టేషను | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|---|---|
| నిజామాబాద్ | 10 | 21 | 8,816 | 5,525 | 14,341 |
| బోధన్ | 10 | 11 | 3,316 | 1,721 | 5,037 |
| ఆర్మూర్ | 13 | 16 | 7,861 | 4,335 | 12,196 |